# "మద్రాసీ"

'విన్నారా! ఈ సంగతి–'

'హ్వా!!! చూశా... పేపర్లో'

'ఒహ్వో!!! ఏంది స్టేట్స్‌మన్?'

'నువ్వు నోరు ముయ్యవయ్యా... ఆట్టే తెగవాక్కు'.

'చిత్తం! ఏమన్నా ప్రమాదమా అండీ?'

'సఫా–సఫా! మద్రాసీ అన్న వాడ్నల్లా తెగనరికేస్తారు చూస్తూండు...'

'అది కాదండీ–మనవేమో ఏ పాపం ఎరగం కదండీ. తెలుగు వాళ్లను కూడా నరికేస్తారా?'

'వాక్కయ్యా? ఇదేమన్నా బెజవాడ ప్లాటుఫారం అనుకున్నావటయ్యా... ఈ సౌతిండియన్ అన్నవాడికల్లా రోజులు మూడాయి. ఒక్క పురుగన్నా మిగల్చకుండా....'

'మనం ఆంధ్రులం కదండీ?'

'హైదరాబాదీ అని చెప్పు...లేక పోతే చెప్పుల్తో పూజిస్తారు.'

'అదేం కర్మండీ–ముంద్రాగాడి అభాంద్రావ్యవహారం...'

'వాడికేంరాజా...హి యీజ్ రైట్. బిజినెస్‌మాన్ అన్నవాడింకేం చేస్తాడు? మన దక్షిణాది బంగారం మంచిదవాలి కాని...'

'అదేవిటండీ– బిజినెస్‌లో ఆనెస్టీ వుండొద్దూ?'

'పోవయ్యా ఏంవి నీ యింటిలిజెన్స్... బొంద ఇంటిలిజెన్సు? సౌతిండియన్ ఇంటిలిజెన్స్...ఉత్తరాదివాడు పరిపాలించడానికే పుట్టాడు పరిపాలిస్తాడు. ఒక్క పర్మిటు సంపాదించు. గుడివాడలోనో ఆ చుట్టు ప్రక్కల్లో రెండు మిల్లులు. ఓపెన్ చెయ్యి. బొంబాయి నుంచి నీకు కోట్లు కాపిటల్ కురవక పోతే చెప్పు. గుజరాతీ వాలా లేకపోతే నీఇండియా ఏముందయ్యా? తూర్పున బంగాళాఖాతమూ, ఉత్తరాన హిమాలయా పర్వతములూ–'

'స్టేట్సుమన్ చూశారు గదండీ...'

'ప్హో! చస్తే చావనియ్యవయ్యా! నువ్వింకా ఆ అరవాళ్ళని పట్టుకుని దేవులాడతానంటావే? కరప్షన్‌లో డిగ్నిటీ వుందయ్యా...అది ఉత్తరాదివాడికి తెలుసు. అస్సలు అవినీతి లేకుండా దేశాన్ని ఎట్టాగయ్యా పరిపాలించడం? మనదక్షిణాది వాళ్ళంతా చవటలయ్యా! ఉత్తరకుమారులు-అభిమన్యుళ్లూ..లోపలికిపోవడం తెలుసు బైటకిరావడం తెలీదు. లంచం పుచ్చుకోడం తెలీదు. లంచం ఇవ్వడం తెలీదు. ఏఁవి ఇంటలిజెన్సయ్యానీది? బ్లడీ దక్షిణాది మేధన్సు...యస్సార్...నోస్సార్ బగ్గర్స్. అస్స లెందుకయ్యా వచ్చావు ఢిల్లీ? ఉద్యోగాల్లో ఏముందయ్యా నీబుఱ్ఱ... మన వాడికెవడి కన్నా డిప్లమసీ...డిప్లమసీ తెలుసూ? బోడిముండ డిపుటేషన్స్...మాట్లాడితే ఓమంద పాలోమని ఢిల్లీరావడం... చేసేపని కాస్తా చాటపెయ్యల్లా చెరుపుకుని మళ్ళీ బెజవాడ ప్లాటుఫారం మీద గప్పాలు కొట్టడం! ఇదేనటయ్యా పోలిటిక్స్...ఢిల్లీలో ఎవడ్నన్నా చప్రాసీని కదిలించి చూడు-పని చేస్తాడేమో. ఉత్తరాది గుమాస్తాని పల్కరించు... పదిరూపాయలు చేతిలో పెడితే ఫైలు తీసుగొచ్చి చేతిలో పెట్టేస్తాడు. పని చెయ్యకుండా ఎంజాయి చెయ్యడం నీకేం తెల్సునయ్యా? దక్షిణాది గుమాస్తాలు చూడు బల్లలక్రింద నల్లుల్లా పాకుతూ వుంటారు.'

'అస్సలు మనవాళ్ళే గదండీ లోయర్ లెవెల్సులో కంట్రీని రూలు చేస్తూంట...'

'ఆపవయ్యా.... సంతోషించాం నీ తెలివికి...'

'అస్సలు పనంతా మనవాళ్ళే గదండీ చేస్తూంట-శుభ్రంగా ఇంగ్లీషు రెండు ముక్కలు రాయాలన్నా...'

'తగ్గవయ్యా...నీ బ్లడీ యింగ్లీషు తగలబెట్టవయ్యా...రేపు హిందీ వచ్చాక చూడు నీపాట్లు...కుక్కల్లా తరిమి తరిమి కొడ్తార ఉద్యోగానికొస్తే...సఫా!! సఫా!! మద్రాసీ అన్న వాడ్నల్లా సఫా...కేబినెట్ చూశావుగా తెలుస్తోంది.

'వాళ్లూరుకోరండోయ్, ఈవీఆర్ పీకుత్తరించేస్తానంటూంటే...ఐతే మన బ్రతుకేమిటి?'

'హైదరాబాదీ అని చెప్పవయ్యా... ఐమీన్ నీ వంట్లో ఎల్లాగుందీ?'

'చెడ్డ ఖరాబుగా ఉందండీ.'

'కథ వ్రాయటం మానెయ్... ఐమీన్టుసే...టీబీ వచ్చి చచ్చి పోతావ్? శుభ్రంగా తినవయ్యా... డోంటాక్ యీవిన్ విత్ యువర్ వైఫ్. ఆంజనేయదండకం చదువుకో రాత్రి పడుకోబోయేటప్పుడు. రాత్రిళ్ళు మేలుకొని ఏమిటా రాతలు నీ బొంద....'

'స్టేట్సుమన్ చదివారాండీ? ఐ మీన్ టు సే దట్ రిపోర్టరు-ఆ విలేఖరి కథనం...వాడండీ విలేఖరి. ఇంకా ఇండియాలో న్యూస్ పేపర్లో జీవం ఉంచడానికి అల్లాటి విలేఖర్లు కారణం'.

'ఏవిటి నీబొంద-స్టేట్సుమన్, స్టేట్సుమన్ అని ఒకటే అరుస్తున్నావ్ చెవిగోసిన మేకలాగ...'

'అదీ రామనాథన్ కేసు....'

'వాడు నిజంగా చావాల్సిందే...'

'ప్చ్!'

'నో సింపతీ...మద్రాసీ అన్న వాడ్నల్లా సఫా-సఫా-వుంచరు. ఢిల్లీలో నరికేస్తారు'

'పాపం రామనాథన్ ఏం చేశాడండీ?'

'ఏం చెయ్యడమేమిటోయ్-వాడు పెరిగి పెద్దయితే యింకేమన్నా ఉందీ? ఇండియాని అమ్మేస్తాడు.'

ఈ జరిగిన సంభాషణలో కథకేం సంబంధం లేదు.

అస్సలేం జరిగిందంటే-

రామనాథన్ అభిమన్యుడిలాటి కుర్రవాడు. 'నల్లమేక' లాటివాడు. పొట్టకోసం అనేకమందిలా కడుపు చేత్తో పట్టుకుని ఢిల్లీ వచ్చినవాడు. నౌఖరీమీద బ్రతికేవాడు. కాఫీ త్రాగితేనేగాని వుండలేనివాడు. పెళ్ళికావలసినవాడు. కట్నం పుచ్చుకోవలసినవాడు. వృద్ధిలోకి రావలసినవాడు. పొడుగ్గా ఉంటాడో, పొట్టిగా ఉంటాడో, లావుగాఉంటాడో, సన్నగాఉంటాడో, బ్రాహ్మడో, అబ్రాహ్మడో, శాకాహారో, మాంసాహారో, తెల్లనివాడో, నల్లనివాడో తెలియదు.

వయస్సు పాతిక లోపు. స్టెనోగ్రాఫరు. కేంద్ర సచివాలయం, ఉత్తర విభాగంలో, విత్తమంత్రిత్వశాఖలో పని. అరవపిల్లకాయ-శనివారం నాడు జీతం పుచ్చుకున్నాడు. ఆదివారం నాడు మ్యాటీని సినిమాకి వెళ్ళాడు. సోమవారం నాడు ఆఫీసు కొచ్చాడు. మధ్యాహ్నం సుమారు ఒంటిగంట నుంచీ పరారీ-ఏమైపోయాడో తెలీదు. మాయమైపోయాడన్నారు. సోమవారం వెళ్ళిపోయింది. మంగళవారం గడిచింది. పోలీసు రిపోర్టిచ్చాడు. బుధవారం కూడా ఐపో వచ్చింది. ఆఫీసులో ఫలహార సమయంలో రామనాథన్ అంతర్ధానమయ్యాడు. ఆఫీసరు 'రెండు ఉత్తరాలు చెబుతాను-తీసుకో' అన్నాక మళ్లీ కనుపించలేదు. చెప్పకుండా ఇంటికి వెళ్ళిపోయాడా? ఎవిరితోనన్నా ఊళ్లో తిరగడానికి వెళ్ళాడా? ప్రవరాఖ్యుడిలాటి కుర్రాడు కాదదేమీ కాదన్నారు.

ఢిల్లీలో షర్లాక్ హొూమ్సులు, వాట్సన్‌లు లేకపోవటం మూలాన తిరిగి రామానాథన్ బైటపడేవరకూ పోలీసులు ఆచూకీ తియ్యటానికి అవకాశం చిక్కలేదు. అస్సలు రామనాథన్ ఏమయ్యాడు? ఆ ఆఫీసరు రెండు ఉత్తరాలు చెబుతాను అన్న తరువాత ఏమంది? కేంద్రసచివాలయంలో మనుష్యులు మాయమవడం సంభవమా? కేంద్రసచివాలయం భవనాలు ఉత్తరవిభాగం, దక్షిణవిభాగం అని ఎదురుబొదురుగా ఉంటాయి. ఈ రెండు భవనాలకి మధ్యగా 'రాజపథ్' ఒక వైపున 'ఇండియాగేటు' వరకూ రెండవ తట్టున 'రాష్ట్రపతి భవనం' వుంటాయి. రాష్ట్రపతి భవనానికి ఉత్తరపార్శ్వాన, దక్షిణ పార్శ్వాన కూడా పార్లమెంటు సభ్యుల కోసం కేటాయించి నిర్మించిన భవనాలుంటాయి. ఈ

సచివాలయ భవనాలు, రాష్ట్రపతి భవనము, ప్రధానమంత్రి భవనానికి భూగర్భంలో సొరంగాలు ఉన్నాయట. ప్రస్తుతం ఆ భూగర్భంలో వున్న సొరంగాలద్వారాలన్నీ మూయబడే ఉంటాయి. ఆ అట్టడుగుదారుల్లోంచి ఎలక్ట్రిక్‌తీగలు, తంత్రులు' టెలిఫోనుతీగలు గుట్టలు గుట్టలుగా ఈ భవనాలను కలుపుతూ ఉంటాయి. సచివాలయం భూగర్భ వసతుల్లో వివిధ మంత్రిత్వశాఖలకు చెందిన రికార్డులు దాస్తారు. కొండొకచో ఈ అట్టడుగు గట్టర్లలో చప్రాసీలు పేకాటలు ఇత్యాది వినోదకార్యక్రమాలతో ప్రొద్దుపుచ్చడం కూడా కద్దు.

ఏతావాతా చొప్పొచ్చేదేమంటే బుధవారంనాడు రాత్రి కేంద్రసచివాలయంలోని ఒక ఎలక్ట్రిక్ సబ్‌స్టేషను వద్ద లోపల కాపలాడ్యూటీలో వున్న సెక్యూరిటీ పోలీసు తాలూకు సెంట్రీ-ఇద్దరు డ్యూటీ మీద పనిలో వున్న ఎలక్ట్రీషియన్లు భూగర్భంలోని ఒక పలక దగ్గర ఒక విధమైన గడబిడ-రణగొణ ధ్వని విని ఆ పలకను నేరుపుగా వత్తిగించి చూస్తే-ఒక మానవాకారం, సచివాలయం అధఃపాతాళం నుంచి ఆ వైరుల కట్టల్ను ఒత్తిగించుకుంటూ పైకి భూభాగం మీదకు రావటానికి ప్రయత్నిస్తోన్నట్లు తెలిసింది.

'దొంగ-దొంగ' అని ముగ్గురూ అరిచారు. 'చచ్చిపోతావు-వైరులు బ్రతికివున్నాయి' అని కరుణార్ద్రులైన ఆ ముప్వురూ ఆ ప్రాణిని బైటకు లాగారుట. సమయం రాత్రి పన్నెండు గంటలు. రాత్రి పన్నెండు గంటలప్పుడు భారత ప్రభుత్వ కేంద్ర సచివాలయ ఉత్తర విభాగ భవనాన అట్టడుగున ఈ ప్రాణి ఏంచేస్తుండవచ్చు.

'ఆకలి! ఆకలి! దాహం! దాహం! అని ఆ ప్రాణి అరుస్తున్నాడు.

'దొంగలంజ కొడుకు...రాష్ట్రపతి భవనానికో, ప్రధానమంత్రి భవనానికో భూమి అట్టడుగునుంచి ఏదో మహా ప్రమాదకరమైన ఘోరం చేసెయ్యటానికి ఏ పాకీస్థాను ఏ జంటోవచ్చి ఇందులో దూరాడ'న్నారు.

'బాదండిరా బాదండి! దేశ ద్రోహి! లుచ్ఛా!' ముగ్గురు ఫడాఫడా దరువు లంకించు కున్నారు. ఆ అభిమన్యుడు 'దాహం! దాహం-మంచినీళ్ళు! ఆకలి! ఆకలి! తినడానికేదన్నా పెట్టండి' అని ఏడుస్తున్నాడు.

'ఆకలి! ఆకలి! అన్నం-అన్నం!'

'నీళ్ళు-నీళ్ళు-' అని కేకలు.

సమాధానంగా దరువులు. కొంతసేపు జరిగాక పోలీసులకు ఫోను చేశారు. పోలీసులు క్షణంలో కారులో వచ్చి లాటీలతో 'తొత్తుకొడకా-భూగర్భంలోకి ఏం పనిమీద దూరావుచెప్పు.' తమవంతు తడాఖా చూపించి స్టేషనుకు లాక్కుపోయారు. తరువాత పోలీసువాళ్ళు ఆ వ్యక్తి ఆకలి కేకలకు వినిపించుకోలేదు. గుడ్డలు సోదాచెయ్యగా యాభై రూపాయలు మాత్రం దొరికాయి.

ఒక్క తెలివైన పనిమాత్రం జరిగింది. రామనాథన్ అని ఒక స్టెనోగ్రాఫరు తప్పిపోయా దన్నారు గదా, వాళ్ల బంధువులకు ఫోనుచేసి వచ్చి చూసుకోమన్నారు. వాడే వీడా రుజువు

చేసుకోమని. ఆ బంధువు అర్ధరాత్రి అరచేత్తో గుండెలు తడుముకుంటూ టాక్సీమీద వచ్చి చూశాడు.

'ఇంకేముందిరా. రామనాథన్-ఏవైపోయావురా - ఎట్లా వొచ్చావురా?' అని ఆ బంధువు ఒకటేగోల- అరవగోల!

'దాహం-దాహం, అన్నం-అన్నం ఆకలి-తింటానికేమన్నా పెట్టండి' అని అరుస్తున్నాడు, ముఖం డోక్కుపోయి, వొళ్ళుచితికిపోయి, శరీరం తునాతునకలై నెత్తురు చారికలుకట్టిన బట్టల్లోని కుర్రవాడు-కేంద్ర సచివాలయపుటుద్యోగి, నోరూ వాయీలేని నిరపాయకరమైన కుర్రవాడు (జేబులో అగ్గిపెట్టి అన్నా లేదు.) సిగరెట్లుకూడా కాల్చటంచేత కాని అమాయకుడు.

ఆ బంధువు అడిగాడు-

'కాసిని మంచినీళ్ళు ఇచ్చారా- తింటానికేమన్నా పెడతారా?'

పాపం! పోలీసు స్టేషన్ను అన్న సత్రవనుకున్నాడు కాబోలు! ఎక్కడన్నా పోలీసు స్టేషన్లో మంచినీళ్ళు యిచ్చి అన్నంపెట్టి తలకాయ దువ్వి నీళ్ళోసి బొట్టూకాటుక పెట్టి నేరస్థుల్ని అందులో పాకిస్థాన్ ఏజంటులా కనపడుతూన్న వాడిని, ప్రభుత్వ సచివాలయ భవనానికి చిచ్చుపెట్ట దలచినవాడ్ని (జేబులో అగ్గిపెట్టి అన్నా లేకుండానే) లాలించి మర్యాద చేస్తారా?

'మీవాడు దొంగ-కబడ్దార్! దొంగలకు మంచినీళ్ళు, అన్నం ఇవ్వటానికి వీల్లేదు' అని పోలీసు ఆఫీసరు ఉవాచ.

రామనాథన్ బంధువుకు ఏమీ పాలుపోవడంలేదు. కుర్రవాడు దొరికాడనుకుంటే- ఈ రండాగర్భం-ఇదేమి గొడవ- తెల్లవారేలోపుగా చనిపోతాడేమో! సోమవారం మధ్యాహ్నం అనగా మూడురోజులాయి మంచినీళ్ళు, నిద్రా, భోజనం లేకుండా భూగర్భంలో దారితెన్నూ తెలియకుండా వున్న వాడనిచెబితే పోలీసులు నమ్మటంలేదు. దొంగ-గూండా -కేడీ- రాస్కెల్ నంబర్ వన్ అంటున్నారు.

రామనాథన్ అంకుల్ జాయింట్ శక్రటరీకి ఫోనుచేసి తన గొడవంతా విన్నవించుకునేటప్పటికి రాత్రి ఒంటి గంటన్నర అయింది. రెండు గంటలకి జాయింటు శక్రటరీ పోలీసు అధికారుల్ని ఒప్పించగలిగాడు. రామనాథన్ ఎవర్నీ గుర్తుపట్టే స్థితిలోలేడు.

ఈ మిస్టరీ అంతా ఎప్పుడు విడి పోయిందంటే-

పోలీసులు రామనాథన్ దొరికాక-అతగాడి మెదడు చెదిరిపోయాక-ఆ కుర్రవాడు ఎట్లా తప్పిపోయిందీ అద్భుతంగా పరిశోధించి తభావతు లేకుండా రిపోర్టు ఇచ్చారు.

స్టేట్మెమన్ వ్రాసిన ప్రకారం చూస్తే-

శనివారం జీతంపుచ్చుకున్నాక, ఇవ్వవలసిన వాళ్ళకి బాకీలు చెల్లుబెట్టాక ఆదివారం రెండో తారీకున సినిమాకు వెళ్ళిన రామనాథానికి తరువాత ఏమైందీ జ్ఞాపకంలేదు. సోమవారం నాడు మధ్యాహ్నం ఆఫీసరు రెండు ఉత్తరాలు చెబుతాను రాసుకోమన్నాడు.

స్టెనో గ్రాఫరు నోటు పుస్తకం అయిపోయింది. తెచ్చుకోవటానికి స్టోర్ రూం వైపు వెళ్లాడు. స్టోరు రూముద్వారం వేసి ఉంది. ఆ ప్రక్కనే మరొక ద్వారం కూడా ఉంది. చీకటి కూడా మసగ్గా ఉందేమో- ఆ తలుపు ఈ తలుపు అనుకుని రామనాథన్ ఆ చీకట్లోకి అడుగు వేశాడు. తలుపు తెరిస్తే ఏముంది?ఇరవై మూడడుగుల లోతుకు సచివాలయం అట్టడుగు సొరంగాల్లోకి నిట్టనిలువునా వెళ్ళి పడ్డాడు. ఆ పడ్డం పడ్డం ఎవరు చూశారు గనుక-భూగర్భంలోనే ఈమూన్నాళ్లూ మంచినీళ్లూ, అన్నమూ లేక, బైటకు వచ్చే మార్గం లేక చీకట్లో మృత్యువు క్రీనీడలోనే తిరుగాడ్తూ ఉన్నాడు.

తరువాత పోలీసులకు స్టెనోగ్రాఫరు నోటుపుస్తకం, సెక్యూరిటీ కార్డు, పెనసలు ఆ గోతిలోదొరికాయనుకోండి.

సోమవారం, మంగళవారం, బుధవారం అతనిపాలిట దుర్దినాలు. ఆఖరికి ఎలక్ట్రిక్‌తీగలు, పోలీసులు, ఎలక్ట్రీషియనుల దెబ్బలు, ఇవేవీకూడా అన్నం, నీళ్ళూ, నిద్రా, వెల్తురూ ఎరుగని ఆ ప్రాణాన్ని తుదముట్టించలేక పోయాయి. రామనాథన్ ఆసుపత్రిలో దరిమిలాను కోలుకుంటున్నాడనికూడా స్టేట్సుమన్ వ్రాసింది.

రామనాథన్ కథేమో ఐపోవచ్చింది. పోలీసుల అజ్ఞానంవల్ల జరిగిన అత్యాచారాలకి నేనేమో అంతగా ఎక్కువ పట్టించుకోవటంలేదు.

రామనాథన్ ఆయుర్దాయం గట్టిది. సచివాలయంలో ప్రమాదకరమైన తలుపుల్ని మూయించటం సంగతి ప్రభుత్వం చూసుకుంటుంది.

నాకూ ఆంధ్రాభిమానం ఎక్కువే-కాని 'రామనాథన్' ఆంధ్రేతరుడని, ముఖ్యంగా తమిళసోదరుడని, ఆ కారణంగా యీ అమానుష హఠాత్సంఘటననంతా సానుభూతి రహితంగా త్రోసిపుచ్చాలంటే-కథా ప్రారంభంలో నాతో కూచిటప్పాలు కొట్టిన వ్యక్తి 'ఛస్తే చావనీవయ్యా-నీ కెందుకు?' అన్నప్పుడు నాలో కలిగిన విరాగం, నిజంగా రామనాథన్ ఆ గట్టర్లులో చనిపోయివుంటే, ఆ చావుకు నిజంగా నిష్కారణంగా ఆనందించవలసిన పరిస్థితిలో నా ఆంధ్రత్వం ఉండివున్నట్లయితే-యీ జాతిద్వేష మలినపూరితమైన భారతదేశం యావత్తూ గంగలో కలిసినా నేనొక కన్నీటిబొట్టు రాల్చను.

అదీ కథ. ఈ విషయం చెప్పాలనుకున్నాను చెప్పాను. మరొక్క సంగతి-'అవినీతి అనేది ఒక జాతినీ, ఒక ప్రాంతాన్నీ ఆవరించుకుని వుండేది కాదనీ, అది మానవజాతి అంతటా పరివ్యాప్తమై ఉన్నదనీ-దానికోసం 'గొఱ్ఱెపిల్ల-తోడేలు' కథలోలా మనం మారటం అసహజమనీ నా మిత్రుడికి తొలిసంభాషణలోనే గుర్తుచేయాలనుకున్నాను. దరిమిలాను మళ్ళీ అడిగాను 'స్టేట్సుమన్ చదివారా? అని. నా బాధ పడలేకనేమో 'స్టేట్సుమన్ తెప్పించడం మానేశాను' అన్నాడు. కథకంచికి......